సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 4 । జూలై । 2025



కేజ్‌వీల్స్‌తో నడిపితే..

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో ట్రాక్టర్లను నడిపితే రూ. 25 వేల జరిమానా విధించాలని తిప్పాపూర్ గ్రామస్తులు తీర్మానించారు.

- 4లో ▸



మహిళా సంఘాలను..

మహిళా సంఘాలను బలోపేతం చేయడానికి గ్రామ సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని సీఆర్పీలు సూచించారు.

- 5లో ▸

గరిష్టం/కనిష్టం


32.0 /22.1

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

'పోచారం'లోకి స్వల్ప ఇన్‌ఫ్లో



నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టులోకి స్వల్పంగా వరద నీరు వచ్చి చేరుతోంది. లింగంపేట వాగు ద్వారా 12 క్యూసెక్కుల మేర నీరు వస్తోంది. ఈ సీజన్‌లో ఇన్‌ఫ్లో రావడం ఇదే మొదటిసారి. కాగా ఇంతే మోతాదులో ప్రాజెక్టునుంచి నీరు ఆవిరవుతోందని నీటిపారుదలశాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 1.820 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.191 టీఎంసీల నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.

'విద్యారంగాన్ని విస్మరిస్తున్న ప్రభుత్వం'



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి విమర్శించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడిచినా విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం దారుణమన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో గురుకులాలను నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. విద్యార్థులకు స్కూటీ, ల్యాప్‌టాప్‌లను ఇస్తామన్న హామీని ఇంకెప్పుడు నెరవేరుస్తారో సీఎం చెప్పాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోతే ఆందోళనలు చేస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రైవేట్ విద్యాసంస్థలలో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలన్నారు. సమావేశంలో ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రఘురాం నాయక్, జిల్లా కన్వీనర్ శివప్రసాద్, నాయకులు సంపత్, వంశి, సుమన్, గణేశ్, విష్ణు, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

'రోడ్ల కోసం రూ. 32 కోట్లు మంజూరు'




నిజాంసాగర్: అధ్వానంగా ఉన్న రోడ్లకు మరమ్మతులు చేయడం, కొత్త రోడ్లు వేయడం కోసం రూ. 32 కోట్లు మంజూరయ్యాయని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలోని రోడ్ల దుస్థితిని వివరించానని పేర్కొన్నారు. దీంతో ఆయన నిధులు మంజూరు చేశారన్నారు. బిచ్కుంద మండల కేంద్రం సమీపంలోని అయ్యప్ప ఆలయం నుంచి డోంగ్లి మండల కేంద్రం వరకు రోడ్డుకు రూ. 13.3 కోట్లు ఇచ్చారన్నారు. మిగతా నిధులతో ఇతర రోడ్లకు మరమ్మతులు చేయిస్తామన్నారు.

7 న మంత్రి కోమటిరెడ్డి రాక

రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఈనెల 7వ తేదీన జుక్కల్ నియోజకవర్గంలో పర్యటిస్తారని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాలలో పాల్గొంటారని పేర్కొన్నారు.

'పౌష్టికాహారం అందించాలి'



రాజంపేట: అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల సూచించారు. గురువారం బస్వన్నపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులకు పౌష్టికాహారం గురించి రక్తహీనత గురించి వివరించారు. ప్రీ స్కూల్ పిల్లలతో అభినయ గీతాలు చెప్పించారు. కార్యక్రమంలో సీడీపీవో రోచిష్మ పాల్గొన్నారు.



అశోక్‌నగర్ కాలనీలో గుంతలలో నిలిచిన వర్షపు నీరు

బల్దియాలో దారిద్ర్యం!

- కామారెడ్డి పట్టణంలో ఛిద్రమైన రోడ్లు
- వర్షపు నీటితో ప్రమాదకరంగా మారిన గుంతలు
- ఇబ్బందిపడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సాక్షి ఫోకస్

కామారెడ్డి బల్దియా పరిధిలోని అంతర్గత రోడ్లతోపాటు ప్రధాన రోడ్లూ అధ్వానంగా మారాయి. అడుగడుగునా గుంతలు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం కావడంతో వరద నీరు చేరి మరింత ప్రమాదకరంగా మారాయి. ఎక్కడ గుంత ఉందో తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురి అవుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. – కామారెడ్డి టౌన్

జిల్లాకేంద్రంలోని అన్ని రోడ్లపైనా భారీ గుంతలు ఏర్పడ్డాయి. అశోక్‌నగర్ కాలనీ ప్రధాన రోడ్డుగుండా వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. పలుచోట్ల వర్షంతో బురదమయంగా మారింది. గుంతలనిండా నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బందిపడుతున్నారు. ఈ రోడ్డు దుస్థితిపై ఇటీవల స్థానికులు అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు. దీంతో స్థానికులే మట్టిని పోసి గుంతలను పూడ్చారు.

కొత్తబస్టాండ్ నుంచి రైల్వే గేట్ వరకు రోడ్డు పరిస్థితి కూడా దారుణంగా ఉంది. విద్యానగర్‌కాలనీలో సాయిబాబా ఆలయం పక్కన చౌరస్తాలో పెద్ద గుంత ఏర్పడి నెలలు గడుస్తున్నా పూడ్చేవారు లేరు. జన్మభూమిరోడ్‌లో అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. సైలానీబాబా కాలనీ, రామారెడ్డి చౌరస్తా నుంచి రాజీవ్‌నగర్‌కాలనీ వరకు, పాతబస్టాండ్ నుంచి పంచముఖి హనుమాన్ కాలనీ, అడ్లూర్ వరకు, పెద్దబజార్, భవానీరోడ్, వీక్లీ మార్కెట్‌రోడ్, గోపాలస్వామిరోడ్, భవానీనగర్, సుభాష్‌రోడ్, సిరిసిల్లరోడ్, గాంధీనగర్ లాంటి ప్రధాన రోడ్లపైనా భారీగా గుంతలున్నాయి. ప్రధాన రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే ఇక అంతర్గత రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. రోడ్ల పరిస్థితిపై మున్సిపల్ అధికారులతో పాటు ప్రజావాణిలోనూ ఫిర్యాదు చేస్తున్నా ఫలితం లేదని పట్టణవాసులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, మరమ్మతులు చేయించి గుంతల చింత తీర్చాలని కోరుతున్నారు.



విద్యానగర్ కాలనీలో..



విద్యానగర్ కాలనీలోని సాయిబాబా ఆలయం చౌరస్తాలో ఏర్పడిన గుంత

మరమ్మతులు చేయిస్తాం

బల్దియాలో నిధులు లేక నూతన రోడ్ల పనులకు టెండర్లు నిర్వహించడం లేదు. అయితే పట్టణంలో ఎక్కువగా గుంతలున్న రోడ్లను గుర్తించి మరమ్మతులు చేయిస్తాం. అశోక్‌నగర్ కాలనీలో నూతన రోడ్డు వేయడానికి కృషి చేస్తాం. ఇంజినీరింగ్ అధికారులతో చర్చించి అన్ని కాలనీలలో రోడ్లపై గుంతలను పూడ్చివేయిస్తాం.

– రాజేందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, కామారెడ్డి



రాజీవ్‌నగర్ కాలనీలో పైప్‌లైన్ కోసం తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

ముహూర్తమెప్పుడో?

- తెయూలో బాలికల నూతన హాస్టల్ భవనానికి రూ.7 కోట్లు మంజూరు
- పూర్తయిన టెండర్ ప్రక్రియ
- ఇప్పటికీ ప్రారంభం కాని పనులు



తెయూ మెయిన్ క్యాంపస్‌లోని బాలికల హాస్టల్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్‌లో బాలికల నూతన హాస్టల్ నిర్మాణ పనులకు ముహూర్తం కుదరడం లేదు. నూతన గర్ల్స్ హాస్టల్ నిర్మాణం కోసం రూ.7కోట్ల రూసా నిధులు అందుబాటులో ఉన్నా, నిర్మాణ పనులకు మోక్షం లభించడం లేదు. తెయూ మెయిన్ క్యాంపస్‌లో బాలురకు రెండు హాస్టల్స్ ఉండగా, బాలికలకు మాత్రం ఒకే హాస్టల్ ఉంది. బాలుర రెండు హాస్టల్స్‌లో కలిపి 447 మంది ఉండగా, బాలికలకు ఉన్న ఒక్క హాస్టల్‌లోనే 440 మంది బాలికలు ఉంటున్నారు. దీంతో బాలికలు ఒకే గదిలో 6నుంచి 8మంది ఉండాల్సి రావడంతో బాలికలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

2022లో యూజీసీ ఆదేశం

వర్సిటీ క్యాంపస్‌లో బాలురు, బాలికలకు సరిపడా నూతన హాస్టల్స్ నిర్మించాలని యూజీసీ 2022 నవంబర్‌లో ఆదేశాలు జారీ చేసింది. రెండున్నరేళ్లు కావొస్తున్నా హాస్టల్ నిర్మాణానికి ఇప్పటికీ అడుగు ముందుకు పడటం లేదు. గత విద్యాసంవత్సరం మేలో తెలంగాణ యూనివర్సిటీకి రూ.8.60 కోట్ల రూసా నిధులు మంజూరయ్యాయి. ఇందులో రూ.7కోట్లు నూతన బాలికల హాస్టల్ నిర్మాణానికి, ఫుట్‌పాత్ నిర్మాణానికి రూ.కోటి, కంప్యూటర్ సైన్స్ కాలేజీ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.60 లక్షలు వెచ్చించాల్సి ఉంది. టెండర్ పూర్తయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ (తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ ఉమెన్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్)తో అగ్రిమెంట్ చేసుకోక పోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికైనా వర్సిటీ వీసీ, ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్ నిర్మాణం వెంటనే చేపట్టాలని విద్యార్థినులు కోరుతున్నారు.

త్వరలో పనులను ప్రారంభించేందుకు కృషి



తెయూలో బాలికల నూతన హాస్టల్ భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీ టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీతో కాంట్రాక్టర్ అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంది. కానీ అగ్రిమెంట్ కాకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోంది. ఈ విషయమై సదరు కాంట్రాక్టర్‌తో వీసీ యాదగిరిరావు మాట్లాడారు. వీలైనంత త్వరగా హాస్టల్ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నాం.

– యాదగిరి, రిజిస్ట్రార్, తెలంగాణ యూనివర్సిటీ

ఆర్మూర్‌లో జూనియర్ కళాశాల సీజ్

- అనుమతులు ఒకచోట.. నిర్వహణ మరోచోట
- అయోమయంలో 800 మంది విద్యార్థులు



ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో ఉన్న క్షత్రియ జూనియర్ కళాశాల భవనం

ఆర్మూర్: నిబంధనలకు విరుద్ధంగా ఆర్మూర్ పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో ఉన్న ఓ భవనంలో కొనసాగుతున్న క్షత్రియ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈవో) రవికుమార్ గురువారం సీజ్ చేశారు. విద్యార్థులను ఇళ్లకు పంపించి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఆ భవనంలో కళాశాలను నిర్వహణకు మూడేళ్ల క్రితం ఇంటర్మీడియట్ బోర్డు అనుమతులను నిరాకరించింది. దీంతో క్షత్రియ జూనియర్ కళాశాల యాజమాన్యం ఆర్మూర్ మండలం చేపూర్ శివారులోని క్షత్రియ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో కళాశాల నిర్వహణకు అనుమతులు తీసుకున్నారు. కానీ నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో ప్రమాదకరంగా ఉన్న భవనంలోనే తరగతులను నిర్వహిస్తూ వస్తున్నారు. సుమారు 500 మంది బాలబాలికలు ఇదే భవనంలోని పై అంతస్తుల్లో హాస్టల్‌లో ఉంటుండగా, మరో 300 మంది విద్యార్థులు డేస్కాలర్స్‌గా చదువుకుంటున్నారు. మరో ప్రైవేట్ కళాశాల యజమాని క్షత్రియ జూనియర్ కళాశాలపై అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేయడంతో పాటు విలేకరుల సమావేశం నిర్వహించి నిబంధనలను అతిక్రమించిన తీరును వివరించారు. స్పందించిన అధికారులు కళాశాలను సందర్శించి సీజ్ చేసి దిద్దుబాటు చర్యలు చేపట్టారు. అడ్మిషన్ తీసుకున్న సుమారు 800 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఏం చేయాలో పాలుపోక అయోమయానికి గురవుతున్నారు. మూడేళ్లకు పైగా నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలో జూనియర్ కళాశాలను నిర్వహిస్తున్నా తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరించిన అధికారుల తీరుపై పలువురు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు.

పారిశుద్ధ్య పరిరక్షణకు చర్యలు



రాజీవ్‌నగర్‌కాలనీలో సానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రాజేందర్‌రెడ్డి

- మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

కామారెడ్డి టౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక చర్యలు చేపడతామని మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన 'పురం.. స్వచ్ఛతకు దూరం' కథనంపై ఆయన స్పందించారు. పట్టణంలో పారిశుద్ధ్య పనుల తీరుపై సానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనులను పరిశీలించారు. టీచర్స్‌కాలనీ, రాజీవ్‌నగర్, సైలానీబాబా తదితర కాలనీలలో మురికి కాలువలు, రోడ్లను శుభ్రం చేయించారు. రోడ్ల పక్కన పేరకుపోయిన చెత్త కుప్పలను డంపింగ్ యార్డుకు తరలించారు. మురికి కాలువలు లేని చోట నూతన సీసీ డ్రెయినేజీల నిర్మాణానికి కృషి చేస్తామని కమిషనర్ తెలిపారు.



దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

'బడికి అండగా నిలుస్తా'

రామారెడ్డి: చిన్నతనంలో తాను చదివిన రామారెడ్డి సర్కార్ బడి అభివృద్ధికి అన్ని విధాలుగా అండగా నిలుస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. గురువారం రామారెడ్డి, గోకుల్ తండా, గిద్ద గ్రామాలలో పర్యటించారు. రామారెడ్డి ప్రభుత్వ పాఠశాలను పరిశీలించారు. తను చిన్నతనంలో ఇదే మైదానంలో ఆడుకున్నానని, ఇక్కడే చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. రామారెడ్డి సర్కారు బడికి కావలసిన అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లను వెంటనే నిర్మిస్తానన్నారు. అనంతరం రామారెడ్డి మైదానంలో విద్యార్థులతో కలిసి ఫుట్‌బాల్ ఆడారు. నిర్మాణంలో ఆగిపోయిన గంగమ్మ వాగు బ్రిడ్జిని పరిశీలించి పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మాగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ గౌడ్, నాయకులు అరవింద్ గౌడ్, బీపేట నర్సింలు, అంబానీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఏళ్ల నాటి సమస్య తీరేనా?

- పరిష్కారానికి నోచుకోని భూ సమస్యలు
- ఏళ్లుగా ఎదురుచూస్తున్న రైతులు
- రెవెన్యూ సదస్సులలో 32,592 దరఖాస్తులు
- 'భూభారతి'తోనూ తొలగని ఇబ్బందులు



కామారెడ్డి క్రైం: రైతుల భూ సమస్యలు ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో చాలా మంది రైతులు సంక్షేమ పథకాలకు దూరమయ్యారు. ఆయా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం 'ధరణి' స్థానంలో 'భూభారతి'ని తీసుకువచ్చింది. ఇటీవలే అన్ని గ్రామాలలో రెవెన్యూ సదస్సులు సైతం నిర్వహించి రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా గత నెల ప్రారంభం నుంచి 20 వ తేదీ వరకు నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో మొత్తం 32,592 దరఖాస్తులు వచ్చాయి. వాటిలో దాదాపు 32,015 దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.

పరిష్కారాల కోసం దాదాపు 13,338 మందికి నోటీసులు జారీ చేశారు. అసైన్‌మెంట్ భూముల క్రయ, విక్రయాలకు సంబంధించిన రికార్డుల అప్‌డేషన్ కోసం 7,932, సాదాబైనామా కోసం 3,452 దరఖాస్తులు వచ్చాయి. పీవోటీపై ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సాదాబైనామాలకు సంబంధించిన అంశం హైకోర్టు పరిశీలనలో ఉంది. దీంతో ఈ రెండు రకాల దరఖాస్తులకు ఇప్పట్లో పరిష్కారాలు లభించే అవకాశాలు లేవు. కొందరు కోర్టులో కేసు నడుస్తున్నా రెవెన్యూ సదస్సులలో దరఖాస్తులు ఇచ్చారు. మరోవైపు వచ్చిన దరఖాస్తుల్లో పరిష్కరించలేనివి మొత్తం ఎన్ని ఉంటాయనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.

పరిష్కారాలు అంతంత మాత్రమే..

రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై అన్ని గ్రామాల్లోనూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 1,078 దరఖాస్తులను పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. ఇవి కాకుండా పైలట్ ప్రాజెక్ట్ కింద లింగంపేట మండలంలో చేపట్టిన భూభారతి సదస్సుల్లో 4,225 దరఖాస్తులు వచ్చాయి. రెండు నెలలు గడుస్తున్నా వాటిలో ఇంకా వెయ్యి సమస్యలు కూడా పరిష్కారం కాలేదు. దీంతో భూసమస్యల పరిష్కారం వంద శాతం పూర్తి కావాలంటే ఇంకా ఎంత సమయం పడుతుందో చెప్పలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతానికి డిజిటల్ పాస్‌పుస్తకాల్లో పేరు, అడ్రస్, భూమి రకం, విస్తీర్ణం, సర్వే నంబర్ తప్పులు, ఆన్‌లైన్‌లో రికార్డులు లాంటి చిన్నచిన్న సమస్యలను పరిష్కరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే వేల సంఖ్యలో దరఖాస్తులు తహసీల్దార్, ఆర్డీవో, జిల్లా అధికారుల లాగిన్‌లలో పెండింగ్‌లో ఉన్నాయి. అధికార యంత్రాంగం చొరవ తీసుకొని వేగవంతంగా పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఇంకెంత టైం పడుతుందో..



నాకు గ్రామ శివారులో 2 ఎకరాల భూమి ఉంది. ధరణి వచ్చిన తర్వాత డిజిటల్ పాసుపుస్తకం వచ్చింది. కానీ, ఆన్‌లైన్‌లో నా భూమి చూపించడం లేదు. మొన్న జరిగిన రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసిన. అధికారులు విచారణ జరిపి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇంకా ఎంత సమయం పడుతుందో తెలియడం లేదు.

– కుమ్మరి బాల్‌రాజు, రైతు, భవానీపేట్, లింగంపేట మండలం

పరిష్కరించాలి



నాకు గ్రామ శివారులో 2 ఎకరాల పట్టా భూమి ఉంది. ధరణిలో ప్రభుత్వ భూమిగా నమోదు చేశారు. 2019 నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా. ఇప్పటికీ పరిష్కారం దొరకలేదు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసి రెండు నెలలు గడుస్తున్నా ఇంకా పరిష్కారం కాలేదు.

– కుంట ఎల్లయ్య, రైతు, బాయంపల్లి, లింగంపేట మండలం

ఎస్సైలకు స్థానచలనం!

కామారెడ్డి క్రైం: జిల్లాలో పనిచేస్తున్న పలువురు ఎస్సైల బదిలీలకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేశారు. దేవునిపల్లి ఎస్సై రాజును వీఆర్‌కు పంపుతూ ఆయన స్థానంలో సదాశివనగర్ ఎస్సైగా పనిచేస్తున్న రంజిత్‌ను బదిలీ చేసినట్లు సమాచారం. రాజంపేట ఎస్సై పుష్పరాజ్‌ను సదాశివనగర్ ఎస్సైగా, పెద్దకొడప్‌గల్ ఎస్సై మహేందర్‌ను వీఆర్‌కు, ఆయన స్థానంలో వీఆర్‌లో ఉన్న అరుణ్ కుమార్‌ను బదిలీ చేసినట్లు తెలిసింది. నస్రుల్లాబాద్ ఎస్సై లావణ్యను రామారెడ్డికి, వీఆర్‌లో ఉన్న రాఘవేంద్రను నస్రుల్లాబాద్ ఎస్సైగా పోస్టింగ్ ఇస్తున్నారు. వీఆర్‌లో ఉన్న రాజారాంను కామారెడ్డి టౌన్ ఎస్సైగా, జుక్కల్ ఎస్సైగా పని చేస్తున్న భువనేశ్వర్‌ను దేవునిపల్లి ఎస్సై-2 గా, వీఆర్‌లో ఉన్న నవీన్ చంద్రను జుక్కల్ ఎస్సైగా నియమిస్తూ అటాచ్‌మెంట్ ఉత్తర్వులు విడుదల చేశారు. అయితే ఈ ఉత్తర్వుల్లో మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. పూర్తి స్థాయిలో బదిలీల ఉత్తర్వులు త్వరలో వెలువడే అవకాశాలున్నాయి.

క్లుప్తంగా

కలుపు నివారణకు మందులు పిచికారీ చేయాలి



మద్నూర్: సోయా పంటలో గడ్డి జాతి కలుపు నివారణకు రైతులు రసాయన మందులు పిచికారీ చేయాలని ఏవో రాజు అన్నారు. గురువారం ఆయన వాడి, ఫతేపూర్, మద్నూర్ తదితర గ్రామాల్లో సాగవుతున్న సోయా పంటలను పరిశీలించి పలు సూచనలు చేశారు. గడ్డి జాతి కలుపు నివారణకు క్విజాలాఫాప్ ఈథైల్ 40 ఎంఎల్ లేదంటే ప్రొపాక్విజాఫాప్ 250ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వెడల్పాటి ఆకు ఉన్నట్లయితే ఇమజిత్‌పెర్ 400 ఎంఎల్ పిచికారీ చేయాలన్నారు.అలాగే గడ్డిజాతి,వెడల్పాటి ఆకు ఉన్నట్లయితే క్విజాలోఫాప్ పితఈథైల్,ఇమాజిత్‌పెర్ 200 ఎంఎల్ మందును ఉదయం పూట గాలి వర్షం లేని సమయంలో భూమిలో తేమ ఉన్న సమయంలో పిచికారీ చేయాలన్నారు.

హెల్మెట్ లేకుండా నడిపితే వాహనాలు సీజ్ చేస్తాం



నిజాంసాగర్(జుక్కల్): హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపితే సీజ్ చేస్తామని పెద్దకొడప్‌గల్ ఎస్సై మహేందర్ వాహనదారులకు హెచ్చరించారు. గురువారం పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజనీ చౌరస్తా జాతీయ రహదారి–161పై వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ.. రోడ్డుపై వాహనాల సంఖ్య పెరుగుతుందని,మద్యం తాగి,అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ వాడకం, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం, లైసెన్స్ లేకుండా నడుపుతున్నట్లు తెలిస్తే వాహనాలు సీజ్ చేయడమే కాకుండా డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

పెండింగ్ చలాన్లు వసూలు

లింగంపేట(ఎల్లారెడ్డి): ముస్తాపూర్‌లో గురువారం ఎస్సై వెంకట్రావు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న చలాన్లు రూ.92 వేలు వసూలు చేసినట్లు ఎస్సై తెలిపారు. అలాగే ఒక డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు చెప్పారు. 300 వాహనాలు తనిఖీ చేసి సరైన ధ్రువపత్రాలు, హెల్మెట్ ధరించని 25 మందికి జరిమానాలు విధించినట్లు తెలిపారు.

కృష్ణాజీవాడిలో అదనపు కలెక్టర్ పర్యటన



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కృష్ణాజీవాడిలో గురువారం అదనపు కలెక్టర్ చందర్ నాయక్ పర్యటించారు. మూడు రోజుల క్రితం గ్రామ కార్యదర్శి చంద్రకళ ప్రజల నుంచి ఇంటి పన్నులతో పాటు మిషన్ భగీరథ బిల్లులను వసూల్ చేశారు. దీంతో గ్రామస్తులు కొన్ని సంవత్సరాల నుంచి మిషన్ భగీరథ బిల్లలను చెల్లించలేదని, ఇప్పుడు ఎందుకు వసూల్ చేస్తున్నారని కార్యదర్శిని అడుగడమే కాకుండా పై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై అదనపు కలెక్టర్ చందర్ నాయక్ గ్రామానికి వచ్చి విచారణ చేపట్టారు. గ్రామకార్యదర్శులు, మిషన్ భగీరథ అధికారులు, గ్రామప్రజలు చెప్పిన విషయాలను అదనపు కలెక్టర్ విన్నారు. ఈ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు. అప్పటి వరకు మిషన్ భగీరథకు బిల్లులను వసూల్ చేయవద్దని అధికారులకు సూచించారు. డీపీవో మురళీ, ఎంపీడీవో సయ్యద్ సాజీద్‌అలీ, ఏఈలు ప్రశాంత్, శిరీష, ఎంపీవో సవిత, గ్రామకార్యదర్శులు చంద్రకళ, బాలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డులున్నా.. నిరుపయోగమే

- ఎక్కడ పడితే అక్కడే చెత్త వేస్తున్న ప్రజలు
- స్పష్టంగా ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపం
- మరుగున పడిన కంపోస్ట్ ఎరువు తయారీ
- పట్టించుకోని అధికారులు



మద్నూర్‌లో రోడ్డు పక్కన వేసిన చెత్త

మద్నూర్(జుక్కల్): ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించి వంద శాతం పారిశుధ్యం సాధించాలన్న లక్ష్యం నెరవేరేలా లేదు. గ్రామాల్లో సేకరించిన చెత్తను ఆరు బయట, ప్రధాన రహదార్ల పక్కన పడేయటంతో డంపింగ్ యార్డులు ఉన్నా లేనట్టుగా ఉన్నాయి. అదే విధంగా పడేసిన చెత్తకు నిప్పు పెడుతుండడంతో దుర్గంధం వెదజల్లుతుండడంతో పాటు పొగతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇలా రోడ్ల పక్కన చెత్తను వేస్తూ నిప్పుపెడుతూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నా అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు. పలు గ్రామాల్లో చెత్త నిర్వహణ ఇంకా చెత్తగా మారింది. సర్పంచుల పదవీకాలం పూర్తయి ఏడాదిన్నర దాటినా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించకపోవడం వల్ల ప్రజాప్రతినిధులు లేక పారిశుధ్య పనులను పట్టించుకునే వారు కరువయ్యారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించినప్పటికి గ్రామాలపై వారి పర్యవేక్షణ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

పొగతో తప్పని తిప్పలు

వర్మి కంపోస్ట్ షెడ్లలో చెత్తను వేరు చేయడం, ఎరువులు తయారు చేయడం వంటి పనులు చేపట్టడం లేదు. పంచాయతీల్లో సేకరించిన చెత్తతో పాటు ప్లాస్టిక్ వస్తువులు, తదితర వ్యర్థాలను అన్నింటినీ ఆరుబయటే తగలబెడుతున్నారు. వచ్చే పొగతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. కుళ్లిన వ్యర్థాలతో వచ్చే వాసనను భరించలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.

నీరుగారుతున్న లక్ష్యం

పల్లెలు, పట్టణాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు పంచాయతీల ఆదాయాన్ని పెంచాలన్న లక్ష్యంతో ఒక్కోదానికి రూ.2.50 లక్షల చొప్పున ఏర్పాటు చేసిన వర్మి కంపోస్ట్ సెగ్రిగేషన్ షెడ్లు ఉమ్మడి మండలంలో నిరుపయోగంగా మారాయి. సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్లలో వేరు చేసి ఎరువు తయారు చేసి అమ్మాలని ప్రభుత్వం నిర్ణయించగా అవకాశాలున్నప్పటికీ వాటిని వినియోగించకపోవడంతో ప్రభుత్వానికి వీటి ద్వారా వచ్చే ఆదాయం కోల్పోవాల్సి వస్తోంది. ఎరువుల తయారీకి సంబంధించి వ్యవసాయ, పంచాయతీ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అవి నిరాదరణకు గురై లక్ష్యం నీరుగారిపోతోంది.

నిప్పు పెట్టకుండా చూడాలి



చెత్తను రోడ్ల పక్కన వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి. రోడ్ల పక్కన చెత్త వేయడంతో అది కుళ్లి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఆయా మార్గాల గుండా వెళ్లాలంటే ఇబ్బందికరంగా ఉంటుంది. –పండరి, హండెకేలూర్

వినియోగంలోకి తీసుకురావాలి



రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన డంపింగ్, వర్మి కంపోస్టు షెడ్లు నిరుపయోగంగా ఉంటున్నాయి. చెత్త వేసేందుకు షెడ్లు నిర్మించినప్పటికీ వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా నిర్లక్ష్యంగా వదిలేయడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. – రవీందర్, మద్నూర్



చిన్న టాక్లీలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త



మద్నూర్‌లో నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డ్



తడిహిప్పర్గాలో ..

ఎకరానికి ఎంత భూమి..

మీకు తెలుసా?

బాల్కొండ: వ్యవసాయ భూములను ఎకరాల్లో(బిగాల్లో) రైతులు తెలుపుతుంటారు. ఎకరానికి ఎంత భూమి అనే విషయాన్ని కింద తెలుసుకుందాం..

- 40 గుంటలకు ఎకరం అవుతుంది.
- రెండు గుంటలకు ఇసా భూమి అవుతుంది
- 20 ఇసాలకు ఎకరం అవుతుంది
- ఎకరానికి 4840 గజాలు అవుతుంది.
- ఎకరానికి 100 సెంట్లు.. గుంటకు 2.5 సెంట్లు
- గుంటకు 121 గజాలు



- ఒక సెంటు భూమికి 48.4 గజాలు
- ఇంటి నిర్మాణాల స్థలాలను ప్లాట్లు అంటారు. ప్లాట్లను గజాల చొప్పున కొనుగోలు చేస్తారు.

మందుల దుకాణాలపై పర్యవేక్షణ కరువు

- ఎవరికి నచ్చిన ధరలకు వారు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్న వ్యాపారులు
- కంపెనీల అచ్చు వేసి ఇష్టం వచ్చిన ఎమ్మార్పీ ధరలతో దోచుకునే అవకాశం





ఒకే కంపెనీ కలుపు మందును వేర్వేరు దుకాణాల్లో వేర్వేరు ధరలకు విక్రయించిన రసీదులు

గాంధారి(ఎల్లారెడ్డి): మండలంలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయా శాఖాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. పురుగు మందులను అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారని భారతీయ కిసాన్ సంఘ నాయకులు ఆరోపిస్తున్నారు. కలుపు మొక్కల నివారణకు వాడే ఒకే కంపెనీకి చెందిన లాడీస్ అనే మందును వ్యాపారులు వేర్వేరు ధరలకు విక్రయిస్తున్నారు. మండల పరిధిలోని చిన్న పోతంగల్ గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు లాడీస్ మందును వేర్వేరు దుకాణాల్లో కొనుగోలు చేసి రసీదులు తీసుకున్నారు. రసీదులు చూసిన రైతులు ధరలో తేడా ఉండడంతో అవాక్కయ్యారు. ఓ దుకాణంలో లాడీస్ మందు లీటరుకు రూ.1,600 చొప్పున రెండు లీటర్లు కొనుగోలు చేశాడు. అదే మందును మరో దుకాణంలో లీటరుకు రూ.1,350 చొప్పున కొనుగోలు చేశాడు. ధరలో తేడాను గమనించిన రైతులు గురువారం భారతీయ కిసాన్ సంఘ నాయకుడు శంకర్ రావు దృష్టికి తీసుకువచ్చారు. శంకర్‌రావు బాధిత రైతులతో పాటు మరి కొందరి రైతులతో కలిసి అధిక ధరకు విక్రయించిన దుకాణానికి వెళ్లి యజమానిని ప్రశ్నించారు. ఒకే మందుకు ఇంత తేడా ఎలా ఉంటుందని రైతులను ఎందుకు దోచుకుంటున్నారని ప్రశ్నించారు. ఆ మందును రూ.1,600 కే విక్రయిస్తామని లేదంటే తాము నష్టపోతామని తెలిపారు. మరో దుకాణంలో రూ.1,350 కే విక్రయించాడు కదా ఆయన ఎందుకు నష్టపోడని ప్రశ్నించారు. లేదు మేవు ఎమ్మార్పీ ధరకంటే తక్కువకే విక్రయించాం.. ఆ మందు ఎమ్మార్పీ ధర రూ.2,200 ఉంటుందని సమాధానం ఇచ్చినట్లు భారతీయ కిసాన్‌సంఘ్ నాయకులు తెలిపారు. పురుగు మందులు ఉత్పత్తి చేసే కంపెనీలు ఎమ్మార్పీ ధరలను అధికంగా అచ్చు వేసి వ్యాపారులకు రైతులను దోచుకునే అవకాశం కల్పిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వం ఈ విషయంపై విచారణ చేసి ఎమ్మార్పీ ధరలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



మాట్లాడుతున్న సౌందర్య

రాజంపేట: ప్రతి విద్యార్థిని బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని మహిళా సాధికారత సిబ్బంది సౌందర్య అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారత కేంద్రం, సఖి కేంద్రం రాజంపేట బాలికల ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మహిళా సాధికారత సిబ్బంది సౌందర్య మాట్లాడుతూ.. బేటీ బచావో బేటీ పడావో అనే విధానంలో ప్రతి ఆడపిల్ల చదువుకొని స్వతహాగా తనకు తాను నిర్ణయాలు తీసుకునే దశకి వెళ్లాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ హెల్ప్ లైన్ నంబర్స్ 1098, 100, 1930 ,181లపై అవగాహన ఉండాలన్నారు. హెచ్ఎం విజయలక్ష్మి, సఖి సెంటర్ సిబ్బంది లావణ్య పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు జూబ్లీ బస్ స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ పెద్ద ఎత్తున ప్రయాణికులు ఎక్కారు. బస్సులో ఒక సెల్‌ఫోన్ కింద పడిపోవడంతో ప్రయాణికులు కండక్టర్‌కు అప్పగించారు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఫోన్ ఎవరిదని ప్రశించినా ఎవరు సమాధానం చెప్పలేరు. దీంతో సెల్‌ఫోన్ కండక్టర్ వద్దనే ఉంచుకున్నారు. బస్సు మేడ్చల్ ప్రాంతానికి రాగానే ఒక మహిళ లేచి తన ఫోను కనిపించడం లేదని గట్టిగా అరిచింది. దీంతో కండక్టర్ ఆమెను పిలిచి సెల్ ఫోన్ తన వద్ద ఉందని చెప్పి ఆమెకు సెల్ ఫోన్‌ను అప్పగించారు.

గ్రంథాలయ భవనంపై పడిన చెట్ల కొమ్మలను తొలగించాలి

ఎల్లారెడ్డి: గ్రంథాలయ భవనంపై పడిన చెట్ల కొమ్మలను తొలగించాలని పాఠకులు కోరారు. బాత్‌రూం గోడలపై చెట్ల కొమ్మలు పడటంతో లోనికి పోయేందుకు పాఠకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని చెట్ల కొమ్మలను తొలగించాలని వారు కోరారు.

రోడ్లపై కేజ్‌వీల్స్‌తో నడిపితే రూ.25 వేల జరిమానా



సమావేశమైన గ్రామస్తులు

భిక్కనూరు: ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి బీటీ రోడ్లను నిర్మింపజేస్తుంటే కొందరు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు కేజ్‌వీల్స్ వాహనాలను నడిపిస్తూ రోడ్లను నాశనం చేయడం తగదంటూ భిక్కనూరు మండలం తిప్పాపూర్ గ్రామస్తులు హెచ్చరించారు. గురువారం వీడీసీ అధ్యక్షుడు కొండ సిద్దరాములు ఆధ్వర్యంలో సమావేశమైన గ్రామస్తులు కేజ్‌వీల్స్‌తో ఎవరైనా ట్రాక్టర్‌ను రోడ్డుపై నడిపితే రూ.25 వేల జరిమానా విధించాలని తీర్మానించారు. ట్రాక్టర్ కేజ్‌వీల్స్‌తో రోడ్డుపై నడిపించినట్టు సరైన రుజువులతో నిరూపిస్తే వారికి రూ.2 వేల నగదు బహుమతి అందించాలని తీర్మానించారు. నేతలు హరిశ్చంద్రారెడ్డి, భీంరెడ్డి, కుంట లింగారెడ్డి, రంగారెడ్డి, శ్రీనివాస్, రాజు, రాజయ్య, ధర్మయ్య, రవి, నర్సయ్య, భూమాగౌడ్, సిద్దరాములు, సంజీవ్, శ్రీకాంత్, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అత్తను హతమార్చిన అల్లుడు

- ఇచ్చిన రూ.లక్ష తిరిగి ఇవ్వాలని అడిగినందుకు ఘాతుకం



లక్ష్మి (ఫైల్)



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పిట్లం(జుక్కల్): రూ.1లక్ష కోసం అత్తను అల్లుడు హతమార్చిన ఘటన పిట్లం మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి(43)కి భర్త, కుమారుడు, కూతురు స్వప్న ఉన్నారు. స్వప్నకు అదే గ్రామానికి చెందిన బాగరాజుతో ఏడేళ్ల క్రితం వివాహం అయింది. ఈక్రమంలో లక్ష్మి కొన్ని నెలల క్రితం అల్లుడు అయిన బాగరాజుకు లక్ష రూపాయలను ఇచ్చింది. బాగరాజు ఇటీవల సాగు చేసిన జొన్న పంటను తన పేరుపై కొద్దిగా, అత్త లక్ష్మి పేరున కొద్దిగా విక్రయించాడు. దీంతో ఇద్దరి బ్యాంకు ఖాతాలలో జొన్నలు విక్రయించిన డబ్బులు పడ్డాయి. దీంతో లక్ష్మి అల్లుడికి గతంలో ఇచ్చిన డబ్బులను తిరిగి ఇవ్వమని అడిగింది. ఈ విషయంపై గురువారం ఉదయం ఇద్దరి మధ్య గొడవ జరుగగా, గ్రామస్తులు సర్ది చెప్పారు. అనంతరం లక్ష్మి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం వండటానికి వెళ్లి, మధ్యాహ్నం ఇంటికి బయలుదేరింది. మార్గమధ్యలో ఆమెను బాగరాజు అడ్డగించి కమ్మకత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలు కావడంతో లక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. బాగరాజు తన అత్తను చంపేశాను పోలీసులకు లొంగిపోతున్న అని గ్రామ మాజీ సర్పంచ్‌కు సమాచారం ఇచ్చాడు. వెంటనే మాజీ సర్పంచ్, గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకొని చూడగా ఆమె అప్పటికే మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఎలాంటి గొడవలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. బాన్సువాడ డీఎస్పీ విఠల్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి కుమారుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృత్యువులోనూ వీడని స్నేహం

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్నేహితుల మృతి
- మూడు కుటుంబాల్లో తీరని విషాదం



నుజ్జునుజ్జయిన పల్సర్ బైక్



వెంకటి(ఫైల్)



గణేశ్(ఫైల్)



నవీన్(ఫైల్)

నిజాంసాగర్: ముగ్గురు స్నేహితులు ఒక బైక్‌పై కలిసి వెళ్లగా, ఘోర రోడ్డు ప్రమాదంలో మృత్యువాతచెందారు. పెద్దకొడప్‌గల్ మండలం జగన్నాథ్‌పల్లి వద్ద గల సంగారెడ్డి–నాందేడ్ 161 జాతీయ రహదారిపై జరిగిన ఘటన వివరాలు ఇలా.. జుక్కల్ మండలం మహమ్మదాబాద్ గ్రామానికి చెందిన పోనుగంటి వెంకటి(22), మంగళి గణేశ్(18), బిచ్కుందకు చెందిన దొడ్లవార్ నవీన్(24) ముగ్గురు స్నేహితులు. గణేశ్ మూడు నెలల కిందట పల్సర్ బైక్ కొనుగోలు చేశాడు. బుధవారం సాయంత్రం వారు ముగ్గురు కలిసి బైక్‌పై పిట్లంకు వెళ్లారు. రాత్రి వేళ ముగ్గురు స్నేహితులు బైక్‌పై నాందేడ్–సంగారెడ్డి జాతీయ రహదారిపై ప్రయాణిస్తుండగా.. అప్పటికే రోడ్డు ప్రమాదానికి గురై, నిలిచి ఉన్న కంటెయినర్‌ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో ముగ్గురి తలలు పగిలి తీవ్ర రక్తస్రావం జరుగగా, ఇద్దరు ఘటన స్థలంలో మృతిచెందారు. ఒకరు మార్గమధ్యలో మృతి చెందారు. సమాచారం అందుకున్న జాతీయరహదారి సిబ్బంది,పోలీసులు మృతదేహాలను అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

జుక్కల్ మండలం మహమ్మదబాద్ గ్రామానికి చెందిన పొనుగంటి సాయవ్వ–గంగారాం దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్నకుమారుడైన వెంకటి ఇంటర్ వరకు విద్యను అభ్యసించాడు. తల్లిదండ్రులకు వ్యవసాయ పనుల్లో చేదోడు, వాదోడుగా ఉన్నాడు. అలాగే అదే గ్రామానికి చెందిన మంగళి హన్మండ్లు–లక్ష్మీబాయి దంపతుల పెద్ద కుమారుడు గణేశ్ నిజామాబాద్‌లో ఇంటర్ చదువుతున్నాడు. బిచ్కుంద పట్టణానికి చెందిన దొడ్లవార్ నాందేవ్–శోభ దంపతుల కుమారుడు నవీన్. వీరు ముగ్గురు స్నేహితులు కాగా, చేతికొచ్చిన కుమారులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

చాముండేశ్వరి ఆలయ బోనాల ఆహ్వాన పత్రిక అందజేత



దోమకొండ: దోమకొండలోని మహంకాళి ఆలయంలో ఈనెల 13న జరిగే మహంకాళి బోనాల పండుగకు రావాలని కోరుతూ గురువారం దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావును కలిసి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు ఆలయ అర్చకులు భావి శరత్‌చంద్రశర్మ తెలిపారు. ఆయన వెంట ఆలయ ఈవో ప్రభు ఉన్నారు.

సొసైటీ సీఈవోకు సన్మానం



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లిసంగారెడ్డి సొసైటీ సీఈవో శ్రీనివాస్‌ను ఉమ్మడి జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగభూషణం ఘనంగా సన్మానించారు. సొసైటీ పరిధిలోని రైతులకు దీర్ఘకాలిక రుణాలు రూ.7 కోట్లు అందజేశారు. ఇచ్చిన రుణాల రికవరీ 2023–24 సంవత్సరంలో రూ. 2 కోట్లు ఉండగా.. 2024–25లో రూ. 2.50 కోట్లు దీర్ఘకాలిక రుణాలు వసూలు చేసి జిల్లాలో 10వ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. మారుమూల గ్రామం శెట్పల్లిసంగారెడ్డి సొసైటీలో రుణాల రికవరీ చేయడంతో పాటు రైతులకు సొసైటీ నుంచి అందిస్తున్న సేవలను గుర్తించి గురువారం నిజామాబాదులోని సొసైటీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఈవో శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. డీసీవో శ్రీనివాస్‌రావు, జనరల్ మేనేజర్ అన్నపూర్ణ, సొసైటీల కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉద్యోగిపై దాడి సరికాదు

బిచ్కుంద(జుక్కల్): మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్‌పై ఏఎంసీ వైస్ చైర్మన్ దాడి సరికాదని టీఎన్‌జీవో కామారెడ్డి జిల్లా ఫోరం అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. బిచ్కుంద ఏఎంసీ కార్యాలయంలో గురువారం ఆయన సిబ్బందితో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిబ్బందిపై దాడి చేస్తే పాలక వర్గానికే అవమానంగా ఉంటుందన్నారు. సిబ్బంది రవికిరణ్, లాలయ్య, సందీప్, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పిట్లంలో..

పిట్లం(జుక్కల్): పిట్లం ఏఎంసీ కార్యాలయం వద్ద సిబ్బంది గురువారం లంచ్ టైంలో నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన చేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఏఎంసీ కార్యదర్శి భాస్కర్‌పై దాడి చేసిన వైస్ చైర్మన్‌ని వెంటనే పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వ్యక్తి మృతి



ఖలీల్‌వాడి: నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుర్తుతెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు నాలుగో టౌన్ పోలీసులు తెలిపారు. గత నెల 25న నగరంలోని బింగి ఫంక్షన్ హాల్ సమీపంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో పడిఉండగా, పోలీసులు గుర్తించి చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో గురువారం అతడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60ఏళ్ల లోపు ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి ఒంటిపై తెలుపు రంగు షర్ట్, లుంగీ ధరించినట్లు పేర్కొన్నారు. మృతుడి వివరాలు ఎవరికైనా తెలిసినచో నాలుగవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గాని, 87126 59840, 87126 59719ను సంప్రదించాలన్నారు.

చికిత్సపొందుతూ ఒకరు..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆత్మహత్యకు యత్నించిన ఓ బాలుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్ గ్రామానికి చెందిన బైండ్ల అనిల్‌కుమార్(16) అనే బాలుడు కొంతకాలంగా కల్లుకు బానిసయ్యాడు. ఈక్రమంలో బుధవారం గ్రామశివారులోకి వెళ్లి గడ్డిమందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనమేరకు మెరుగైన వైద్యం కోసం అతడిని ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్సపొందుతూ గురువారం అతడు మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో మనోహర్‌రావు తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న రోడ్డు రోలర్

- స్తంభం విరిగినా వైర్లు తెగకపోవడంతో తప్పిన ప్రమాదం



నస్రుల్లాబాద్: మండలంలో కొద్దిరోజులుగా 765 డి జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయి. ఈక్రమంలో గురువారం దుర్కి గ్రామ ప్రధాన రహదారిపై రోడ్డు రోలర్‌తో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో స్తంభం విరిగిపోయింది. విద్యుత్ తీగలు తెగిపడకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఒకవేళ విద్యుత్ తీగలు తెగి వాహనంపై పడినా.. లేదా రోడ్డుపై వెళుతున్న వాహనదారులపై పడిన ప్రాణాపాయం జరిగేదని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. స్తంభం విరిగినా కూడా తృటిలో పెను ప్రమాదం తప్పిందని పేర్కొన్నారు. సంబంధిత వ్యక్తులు కొత్త స్తంభం వేయించి సరిచేసి ఇస్తానని అధికారులు తెలపడంతో గ్రామానికి ప్రత్యామ్నాయం మార్గం ద్వారా విద్యుత్ సరఫరా చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న లారీ

- డ్రైవర్ మృతి

నిజామాబాద్ రూరల్: రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంఠేశ్వర్ బైపాస్ వద్ద రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఓ లారీ ఢీకొనడంతో డ్రైవర్ మృతిచెందాడు. వివరాలు ఇలా.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పర్వేజ్‌ఖాన్ (32) ఆదిలాబాద్‌లోని కేటీపీ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో గత ఐదేళ్లుగా లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నగరంలోని కంఠేశ్వర్ బైపాస్‌లో గల లహరి హోటల్ పక్కన ఓ భవన నిర్మాణం కొనసాగుతుండగా మంగళవారం అతడులారీలో సిమెంట్ లోడ్‌ను తీసుకువచ్చాడు. ప్రమాదవశాత్తు సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను లారీ ఢీకొనడంతో డ్రైవర్ పర్వేజ్‌ఖాన్ మృతిచెందాడు. మృతుడి సన్నిహితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరీఫ్ గురువారం తెలిపారు.